క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి సహకరించాలి



బోరుకు పూజ చేస్తున్న చైర్మన్, ఈఓ

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలోని ఎర్రమల కొండలలో వెలసిన దుర్గా భోగేశ్వరాయలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని చైర్మన్ సునీల్‌కుమార్ రెడ్డి తెలిపారు. నంద్యాల పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ భార్గవర్ధన్‌రెడ్డి సహకారంతో ఆలయ ప్రాంగణంలో ఆదివారం బోరు చేశారు. పుష్కలంగా నీరు పడినట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శ్యాంసుందర్ శర్మ, సిబ్బంది రమణ తదితరలు పాల్గొన్నారు.

'సుంకేసుల'లో 1. 068 టీఎంసీల నిల్వ

గూడూరు: 'సుంకేసుల ' డ్యామ్‌లో 1.068 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఆదివారం అధికారులు తెలిపారు. కర్నూలు నగర వాసుల నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు 189 క్యూసెక్కులు విడుదల చేశామన్నారు.

28న దేవాలయంలో హుండీ లెక్కింపు

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి దేవాలయంలో ఈ నెల 28న హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆదివారం కార్యనిర్వహణాధికారి రాధాక్రిష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది మూడు లేదా నాలుగు నెలలకు ఒక మారు హుండీల లెక్కింపు చేపడుతున్నామన్నారు. హుండీ కానుకల లెక్కింపును గ్రామ పెద్దలు, పోలీసులు, బ్యాంకు అధికారుల సమక్షంలో నిర్వహించనున్నామని ఆయన తెలిపారు.

చకచకా మరమ్మతు పనులు



కుంగిన ప్రాంతంలో కాంక్రీట్ పనులు చేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు కట్ట కుంగిన విషయం తెలిసిందే. మరమ్మతులకు సంబంధించి పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రతి రోజు బారీ వాహనాల్లో మూడి సరుకులు తీసుకొస్తుండగా పనులు చకచకా జరుగుతున్నాయి. ఎలాగైన వరదనీరు వచ్చే సమయానికి సిద్ధం చేయాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. పనులు త్వరగా పూర్తి చేస్తామని ఈఈ సుభకుమార్ తెలిపారు.

నేడు ఇంటర్వ్యూలు

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల నియామకానికి సోమవారం అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాముడు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. పోలకల్ గ్రామంలో మూడు, కొండాపురం గ్రామంలో ఒక్కటి మొత్తం నాలుగు స్థానాలు ఖాళీగా ఉండటంతో దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. ఈ మేరకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలను నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

నేడు చనుగొండ్లలో గడపగ డపకు మన ప్రభుత్వం

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ నిర్వహించనున్నట్లు మండల కో ఆప్షన్ సభ్యుడు దౌల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ కాలనీలలో ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ తిరిగి సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటారన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన తెలిపారు.

ఫుట్‌వే వంతెన నిర్మాణాన్ని నిలిపివేయాలి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు వద్ద జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫుట్ వే వంతెన పనులను నిలిపి వేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జాతీయ రహదారిపైన ఫ్లై ఓవర్ వంతెన లేదా అండర్ బ్రిడ్జి నిర్మించాలని గతంలో అనేకసార్లు అధికారులను కోరినట్లు తెలిపారు. అయినా ఇంతవరకు ఎవ్వరు పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు నంద్యాల చెక్ పోస్టు నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు చేపడుతున్న నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

పాఠం.. దృశ్యరూపం!

- పుస్తకాల్లో క్యూఆర్ కోడ్
- స్కాన్ చేస్తే సెకండ్లలో సందేహాల నివృత్తి
- విద్యార్థులకు సులభతరంగా మారిన నూతన విద్యావిధానం



క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయురాలు

కోడుమూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీటం వేస్తోంది. నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మార్చింది. కార్పొరేట్ పాఠశాలల దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పిల్లలను చదివించే ఏ తల్లీ ఇబ్బంది పడకూడదని అమ్మఒడి, విద్యా, వసతి తదితర పథకాలను ప్రభుత్వం అమలు చేస్తూ అండగా నిలుస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. విద్యార్థులకు సులభంగా పాఠాలు అర్థమయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని తీసుకొచ్చింది. విద్యార్థులు పాఠ్యాంశాలను అర్థం చేసుకునేందుకు పుస్తకాలను విడియో రూపంలో అందుబాటులోకి తీసుకొచ్చింది. కొంతమంది విద్యార్థులు విని నేర్చుకుంటే మరికొందరు దృశ్య రూపాలను చూసి నేర్చుకుంటారనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. దృశ్య రూపంలో చూస్తే విద్యార్థులకు ఎప్పటికీ జ్ఞాపకం ఉంటుంది. సాధారణంగా పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠ్యాంశం బోధించేటప్పుడు విద్యార్థికి ఎన్నో సందేహాలు వస్తుంటాయి. వాటిని నివృత్తి చేసుకోవడంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన క్యూఆర్ కోడ్ విద్యార్థులకు వరంగా మారింది. కోడ్‌ను స్కాన్ చేస్తే పాఠాలకు సంబంధించిన అన్ని సందేహాలు నివృత్తి కావడంతోపాటు అదనపు సమాచారం అందుతోంది. రాష్ట్రప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నూతన విద్యావిధానంలో భాగంగా పుస్తకాల్లో క్యూఆర్ కోడ్‌ను పొందిపరిచారు. విద్యార్థులతోపాటు తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్యూఆర్ కోడ్‌తో పాఠ్యపుస్తకాలు

ప్రతి విద్యార్థి మేధో సంపతిని పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రతి పాఠ్యాంశానికి క్యూఆర్ కోడ్‌ను రూపొందించింది. గతంలో పాఠ్యపుస్తకంలో మొదటి, చివరి పేజీలో మాత్రమే క్యూఆర్ కోడ్ ఉండేది. దీంతో పెద్దగా విద్యార్థులకు ఉపయోగం ఉండేదికాదు. మారిన నూతన విద్యావిధానం అమల్లోకి రావడంతో ప్రభుత్వం కొత్తగా ప్రతి పాఠ్యాంశంపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించింది. ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో ప్రస్తుతం క్యూఆర్ కోడ్ దర్శనమిస్తోంది. ఈ కోడ్‌ను విద్యార్థులు స్మార్ట్ ఫోన్‌లలో స్కాన్ చేసి పాఠ్యాంశాలను చూస్తూ, వింటూ అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి ఇప్పటికే క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌ల ద్వారా ఉపయోగించుకునే విధానాన్ని ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు.

స్కాన్ చేస్తే విడియో పాఠం ప్రత్యక్షం

విద్యార్థులు తాము చదువుకునే పుస్తకాల్లోని క్యూఆర్ కోడ్‌ను స్మార్ట్ ఫోన్‌ల ద్వారా స్కాన్ చేస్తే విడియో రూపంలో పాఠం ప్రత్యక్షం అవుతుంది. పాఠం వింటూ, చూస్తూ నేర్చుకోవచ్చు. విద్యార్థులు వివిధ కారణాలతో పాఠశాలకు రాకపోతే కోల్పోయిన పాఠ్యాంశాలను క్యూఆర్ కోడ్ ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. అనుమానాలు వచ్చిన ప్రతి ప్రశ్నకు సందేహాలకు నివృత్తి చేసుకోవడానికి ఎప్పుడు కావాలంటే అప్పుడు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి విడియో రూపంలో చూసుకునే సౌలభ్యాన్ని అందుబాటులో ఉంటుంది. ఒక్కసారి స్కాన్ చేసి డౌన్‌లోడ్ చేసుకుంటే ఆ పాఠ్యాంశం విద్యార్థుల ఫోన్ గ్యాలరీలో సేవ్ అవుతోంది. ఆఫ్‌లైన్‌లో చూసుకునే అవకాశం ఉంది.



క్యూఆర్ కోడ్‌తో ముద్రించిన పాఠం

చాలా ఉపయోగంగా ఉంది



పాఠ్యాంశాలో సందేహాలను నివృత్తి చేసుకునేందుకు క్యూఆర్ కోడ్ విధానం ఎంతో ఉపయోగంగా ఉంది. ఒక అంశానికి సంబంధించిన పూర్తి వివరాలు విడియో రూపంలో ఉండడంతో పదేపదే చూసి నేర్చుకునే అవకాశం ఉంది. ఈ విధానం వలన పూర్తిస్థాయిలో పాఠ్యాంశాలపై అవగాహన కలుగుతోంది. ఎప్పుడైనా స్కూల్‌కు వెళ్లకపోతే ఆ రోజుకు సంబంధించిన పాఠ్యాంశాలను క్యూఆర్ కోడ్‌తో నేర్చుకునేందుకు అవకాశం ఉంది.

– మనోహర్, 10వ తరగతి విద్యార్థి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం



క్యూఆర్ కోడ్ విధానంలో పాఠ్యాంశాలపై విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. పాఠ్యాంశాలు విడియో రూపంలో ఉండడం వలన త్వరగా అర్థమవుతాయి. అలాగే మెదడులో నిక్షిప్తమైన విడియోలు పునశ్చరణ సమయంలో గుర్తుకువచ్చి విద్యార్థుల ఉత్తీర్ణతకు దోహదపడతాయి. క్యూఆర్ కోడ్ పాఠ్యాంశాలపై ప్రతి తరగతిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– రాజేశ్వరి, ఉపాధ్యాయురాలు

'స్పందన' సమస్యల పరిష్కార వేదిక

కర్నూలు (న్యూటౌన్): ప్రజా సమస్యలకు పరిష్కా ర వేదిక 'స్పందన' కార్యక్రమం అని కర్నూలు రూ రల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉద యం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పిస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని శా ఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

నేడు స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

గూడూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహించే స్పందన కార్యక్రమానికి గైర్హాజరయ్యే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

సి.బెళగల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులందరు తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి అధికారులు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గిరిజనులు అన్ని రంగాల్లో రాణించాలి

– చెంచు కాలనీలో సందర్శించిన డీఐజీ



డీఐజీ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దృశ్యం

పాణ్యం: కర్నూల్ సెకండ్ బెటాలీయన్ డీఐజీ వెంకటేశ్వర్లు పాణ్యంలోని చెంచుకాలనీలో పర్యటించారు. చెంచులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పాణ్యం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మేకల పల్లవి, వీటీడీఏ ప్రెసిడెంట్ సుబ్బరాయుడు ఆయనను సన్మానించారు. డీఐజీ మాట్లాడుతూ గిరిజనులు ప్రభుత్వం అందించే అన్ని రకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తల్లిందండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపాలన్నారు. పిల్లలకు తల్లిందండ్రులు ఇచ్చే పెద్ద ఆస్తి చదువు ఒక్కటే అన్నారు. అలాగే ప్రతి మహిళ పొదుపు సంఘాల్లో చేరి ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. చేతి వృత్తులు, స్వయం సహాయక, చిరువ్యాపారులపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనంతరం చెంచుకాలనీలో మౌలిక సదుపాయాలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, చెంచులు అభివృద్ధి చెందిన ప్రగతిపై సర్పంచ్, వీటీడీఏ ప్రెసిడెంట్‌ను అడిగి తెలుసుకున్నారు.

ప్రమాదకరంగా ఓవర్ హెడ్ ట్యాంకు



శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంకు



పెచ్చులుడిన దృశ్యం

గూడూరు: పట్టణంలోని సంజీవయ్యనగర్‌లో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు శిథి లావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఈ ట్యాంక్‌ను నిర్మించింది. సమీపంలో దేవాలయం , గృహాలు ఉన్నాయి. నిత్యం అటువైపు ప్రజలు తిరుగు తుంటారు. జరగరాని ఘోరం జరిగితే పెద్ద ఎత్తున ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిలం అయిన ట్యాంకు ను తొలగించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ట్యాంకును తొలగించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. విషయాన్ని మున్సిపల్ ఏఈ నరసింహులు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ట్యాంకును తొలగించాలని కాలనీ వాసులు వినతి పత్రం ఇచ్చిన విషయం వాస్తవమన్నారు. విషయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు(రాజ్‌విహార్): మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర మైనారిటీ సలహాదారు హబీబుల్లా అన్నారు. ఆదివారం అయన స్థానిక కర్నూలు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మైనారిటీల సమావేశంలో మాట్లాడారు. మైనారిటీల సంక్షేమానికి నాడు దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ఉన్నత విద్యకు రిజర్వేషన్లు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. చదువుకునేందుకు ఇబ్బంది పడకూడదని ఎస్సీ, ఎస్టీ, బీసీలతో సమానంగా మైనార్టీలకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీ యింబర్స్‌మెంట్ అందజేశారన్నారు. నేడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కూడా తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తూ మరింత మేలు చేస్తున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబు మైనారిటీలను పట్టించుకోలేదన్నారు. అందుకే మైనారిటీలు 2019 ఎన్నికల్లో ఓటుతో ఆయనకు తగిన బుద్ధి చెప్పారన్నారు. అనంతరం హర్ దిల్ మే వైఎస్ఆర్.. హమ్ సబ్ జగన్‌కు సాథ్ అనే పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వరుణుడి కరుణ...పత్తి కళకళ !



పుసులూరులో పచ్చగా మెరుస్తున్న పత్తి పైరు

కల్లూరు: ఎట్టుకేలకు వరుణుడు కరుణించాడు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే సాగు చేసిన పత్తిపైరు కళకళలాడుతుంది. మండల వ్యాప్తంగా ఈ ఏడాది 7,500 నుంచి 7,800 హెక్టార్లలో పత్తి సాగు లక్ష్యంగా వ్యవసాయ అధికారులు అంచనా. ఇప్పటి వరకు 2500 హెక్టార్లలో పత్తి పంటను సాగు చేశారు. ప్రత్యేకించి రెమడూరు, పుసులూరు, బొల్లవరం, హంద్రీ పరివాహక ప్రాంతంతాలు, బోర్ల కింద పత్తిని రైతులు ఎక్కువగా సాగు చేస్తారు. పత్తిపైరు నేలను పచ్చగా కప్పేసినట్లు ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం చెట్లమలాపురం గ్రామంలో సర్పంచ్ ఎస్ భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కాటసానికి నాయకులు, ప్రజలు, మహిళలు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటింకీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాలు బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు కాటసాని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా జగన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అర్హత ఉన్నా కేవలం ధ్రువీకరణ పత్రాలు లేవన్న కారణంతో లబ్ధి పొందలేని ప్రజలకు అవసరమయ్యే కీలక పత్రాలను అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి లబ్ధి పొందలేని వారికి పథకాలను అందించాలనే చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జూలై 1 నుంచి నెల రోజుల పాటు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. గత టీడీపీ పాలనలో ప్రభుత్వానికి సంబంధించి ఏ పని కావాలన్నా కార్యాలయాల చుట్టూ లంచాలు ఇచ్చుకునే పరిస్థితి ఉండేదని విమర్శించారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పరిస్థితిని పూర్తిగా మార్చివేశారన్నారు. పెన్షన్ కావాలన్నా, రేషన్ కావాలన్నా నేరుగా ఇంటికీ తీసుకు వచ్చే వలంటీర్ వ్యవస్థను తెచ్చి గ్రామ సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరో మారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా కాటసాని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రమణమూర్తి, జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, కెడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లా వెంకట రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి, వైఎస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు హనుమంతురెడ్డి, ఉలిందకొండ రమణారెడ్డి, కృష్ణారెడ్డి, మధు, మస్తాన్ నాయుడు, చాంద్‌బాషా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

భోగశ్వరాలయంలో భక్త జనసందడి

గడివేముల: మండల పరిధిలోని దక్షిణ కాశీగా పిలువబడే దుర్గాభోగేశ్వరాలయంలో ఆదివారం భక్తులతో కళకళలాడింది. భక్తులు తెల్లవారుజాము నుంచే పంచకోనేర్లలో స్నానమాచరించి స్వామి,అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామి,అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ చెప్పారు.

తప్పిన ప్రమాదం

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్ల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం మర్రిచెట్టుకు నిప్పు పెట్టారు. దీంతో విద్యుత్ తీగలకు మంటలు వ్యాపించి రోడ్డుపై తెగిపడ్డాయి. రోడ్డుపై పడిన తీగలను గమనించిన వాహనచోదకులు స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్‌ఐ పవన్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని మర్రిచెట్టును, రోడ్డుపై పడిన విద్యుత్ తీగలను పరిశీలించి సమస్యను పరిష్కరించారు. రోడ్డుపై విద్యుత్ తీగలు పడిన సమయంలో రాకపోకలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

30న విజయవాడలో ధర్నా

కల్లూరు: రైతాంగ సమస్యలపై ఈ నెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయా లని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. ఆదివారం కల్లూరు మండలంలో ఆటో జాత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారులో భూములు కోల్పోయిన రైతులకు న్యాయపరమైన పరిహారం అందించాలన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



గురువులతో పూర్వ విద్యార్థులు

కోడుమూరు : మండల పరిధిలోని లద్దగిరి హైస్కూల్లో 1998–99విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 25సంవత్సరాల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు వీరేశప్ప, బాబయ్య, శాంతమూర్తి, నాగార్జున యాదవ్, గిడ్డమూర్తి, సాయిలీల, సుభాషిణి, హాస్టల్ వార్డెన్లు క్రిష్ణారెడ్డి, రాముడుని ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి ఆశ్వీరాదాలు తీసుకున్నారు. అలాగే తమతో పాటు చదువుకుని మరణించిన అనుగొండకు చెందిన మల్లికార్జున కుటుంబానికి రూ.30వేలను అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మధు, నాగ సుంకన్న, మౌలాలి, రమణయ్య, లింగన్న, గజేంద్ర, రుద్రయ్య, తిప్పన్న, బసవరాజు, మహేశ్వరమ్మ, మధులీల, రాజేశ్వరి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రతి రూపాలు సాంఘిక నాటికలు

కర్నూలు కల్చరల్: జీవన ప్రతి రూపాలు సాంఘిక నాటికలని వక్తలు అన్నారు. టీజీవీ కళాక్షేత్రంలో ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే సాంఘిక నాటికల ప్రదర్శనలో భాగంగా సీక్యాంప్ కళాక్షేత్రంలో రెండు సాంఘిక నాటికలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశ్రాంత కలెక్టర్ బలరామయ్య, సీనియర్ దర్శకులు కొల్లా రాధాకృష్ణ, జట్టి హరిబాబు మాట్లాడుతూ సామాజిక చైతన్యంలో కళలు, కళాకారుల పాత్ర ఎంతో ఉందన్నారు. వీటిని ఆదరించి ప్రోత్సహించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగించేందుకు టీజీవీ కళాక్షేత్రంలో క్రమం తప్పకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హైదరాబాద్ కళాంజలి వారి 'మనిషి మంచోడే', 'పాశం' నాటక ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి.

సంత కిటకిట...



వర్షంలో ఇరుకు సందుల్లో సంత నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ప్రతి ఆదివారం నిర్వహించే సంత జనంతో కిటకిటలాడింది. సాయంత్రం ఐదు గంటలకు భారీ వర్షం కురవడంతో వ్యాపారులతోపాటు ప్రజలు ఇబ్బంది పడ్డారు. జనం తడిసి ముద్దయ్యారు. ఇరుకై న సందుల్లో కావడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. అమ్మవారికి శాల, తహసీల్దార్ కార్యాలయం వీధి, పెద్దమ్మ గుడి ముందు వీధులన్నీ విక్రయదారులతో కిటకిటలాడాయి. సంతలో మిర్చి ధర కొండెక్కింది. ఏకంగా కేజీ రూ.100 పలికింది. దీంతో మిర్చి కొనేందుకు ప్రజలు మక్కువ చూపలేదు. అలాగే టమాట కేజీ రూ.60లు పలికింది. వంకాయ రూ.60ల, కాకర రూ.50 వరకు ధర పలికాయి.